క్లుప్తంగా

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇమామ్



మహబూబాబాద్ రూరల్ : మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన ఎండీ.ఇమామ్‌ను టీడీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇమాం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం కావటం రెండోసారి. ఈ సందర్భంగా ఇమాం మాట్లాడారు. అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని అమ్మఒడి అనాథాశ్రమంలోని వృద్ధులకు తొర్రూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మట్ట సరిత గురువారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తొర్రూరు మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు ప్రతినెలా పింఛన్ ఆశ్రమంలోనే అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవ సంస్థ చైర్మన్ మంజుల, సభ్యులు అశోక్, కృపావతి, ఎస్సై జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తొర్రూరు : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ వివరాలను గురువారం వెల్లడించారు. జిల్లాలోని పాఖాల కొత్తగూడ గ్రామానికి చెందిన విద్యార్థి కొమ్ము అజయ్, ఆటోడ్రైవర్ రావులపల్లి భార్గవ్ పట్టణంలోని అమ్మాపురం రోడ్డులో అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 2 కిలోల గంజాయి లభించడంతో ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. గంజాయి తరలింపునకు వినియోగించిన స్కూటీని సీజ్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించారంటూ ఎస్సై రాంజీనాయక్‌ను, సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్సైలు గండ్రాతి సతీష్, లింగారెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

మరిపెడ రూరల్ : మండలంలోని స్టేజితండా పంచాయతీ పరిధిలోని ఆనంద్ నిలయం వెంచర్‌లోని పేకాట స్థావరాలపై పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా 8 మందిపై కేసు నమోదు చేసి రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారి ఉమాకర్ మీడియాకు తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం

పెద్దవంగర : పిడుగు పడి పశువుల పాక దగ్ధమైన ఘటన మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు బీసు యాదగిరి కథనం ప్రకారం.. గ్రామంలో అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురుస్తుండగా పశువుల పాకపై పిగుడు పడింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న గడ్డివాముపై నిప్పురవ్వలు పడి సుమారు 100 మోపులు కాలి బూడిదయ్యాయి. అలాగే పాకలో ఉన్న 40 వడ్లు ఆరబోసే పట్టాలు, రెండు మోటర్ స్టాటర్లు కాలిపోయి సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లింది. పాకలో పశువులు లేకపోవడంతో రైతు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు యాదగిరి కోరాడు.

5 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నగూడూరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 5 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. మండలంలోని ఆకేరు వాగు సమీపంలో ఇసుకను తరలిస్తుండగా తహసీల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం బస్తాలతో వెళ్తున్న డీసీఎం బోల్తా

కేసముద్రం : ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం బోల్తా కొట్టిన ఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలోని బంగారుకత్వ చెరువు కట్టపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సింహులపేట మండలంలోని ఓ కొనుగోలు కేంద్రం నుంచి కేసముద్రంల మండల కేంద్రంలోని రైస్ మిల్లుకు ధాన్యం బస్తాలను తీసుకొస్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ధాన్యం బస్తాలు పడిపోగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఈజీఎస్‌లో అవినీతికి పాల్పడితే చర్యలు

- ప్రజావేదిక పీఓ దయాకర్‌రావు

మహబూబాబాద్ రూరల్ : పనుల నిర్వాహణ, రికార్డుల నమోదు, బిల్లుల చెల్లింపుల విషయాల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ),దయాకర్‌రావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో 2019 డిసెంబర్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై చర్చించారు. డీఆర్‌పీలు తాము సేకరించిన వివరాలు, జరిగిన లోటుపాట్లను వెల్లడించారు. అనంతరం పీఓ దయాకర్‌రావు మాట్లాడారు. పనులు చేయకున్నా బిల్లులు చెల్లించడం, తప్పుడు వివరాల నమోదు, తదితరాలను ఉపేక్షించేది లేదన్నారు. వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య మాట్లాడుతూ గతంలో జరిగిన అవినీతి, అధికారులు రికవరీ చేసిన వివరాలు తెలియజేయాలని వాగ్వాదానికి దిగారు. అధికారుల సంతకాలు లేకుండా కంప్యూటర్ ఆపరేటర్లు బిల్లులు చేశారని, ప్రజలు పనులు చేసి కష్టపడితే బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. బిల్లుల చెల్లింపులో జరిగిన అవినీతిపై విచారణ చేయాలన్నారు. రాత్రి వరకు చర్చ కొనసాగింది. మళ్లీ నేడు (శుక్రవారం) కూడా ప్రజావేదిక కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ భూక్య మౌనిక, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, డీఆర్‌డీఏ జిల్లా విజిలెన్స్ అధికారి బండి గోవిందరావు, అంబుడ్స్‌మెన్ వర్కర్ ఆడెమ్స్, ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, రవీందర్, ఏపీఓలు పార్థసారథి, రమేష్, రమేష్‌రెడ్డి, స్టేట్ టీం సభ్యులు వేణు, ఎస్ఆర్‌పీలు సురేష్‌బాబు, నర్సయ్య, డీఆర్‌పీలు, బీఆర్‌పీలు, ఈసీలు ప్రదీప్, రమేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సమస్యలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్

దంతాలపల్లి : డోర్నకల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తాను పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని బీరిశెట్టిగూడెం, వాల్యాతండా, దాట్ల గ్రామ పంచాయతీను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బీరిశెట్టిగూడెంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి నుంచి ఆ గ్రామ చెరువు కట్ట నుంచి గ్యామతండా వరకు రూ.2.10 కోట్లతో తలపెట్టిన బీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తండాలోనే ఉంటూ నిత్యం ప్రజలకు సేవ చేస్తున్నట్టు తెలిపారు. దాట్లలో 22 లక్షలతో హైస్కూల్ సమగ్రాభివృద్ధి చేపడతామన్నారు. అలాగే రూ.22 లక్షలు, రూ.10 లక్షల వ్యయంతో గ్రామంలో రెండు సీసీ రోడ్లు చేపట్టనున్నట్టు తెలిపారు. దాట్ల, చిలంచర్ల గ్రామాల మధ్య రూ.40 లక్షల వ్యయంతో కల్వర్టు, దాట్ల–బీరిశెట్టిగూడెం గ్రామాలకు రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మిస్తామన్నారు. తాను సర్పంచ్‌గా రాజకీయ జీవితం మొదలుపెట్టి బ్లాకు సమితి అధ్యక్షుడుగా, 6 సార్లు ఎమ్మెల్యేగా, మొత్తం 42 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. తనకు తప్ప నియోజకవర్గంలో ఓటడిగే హక్కు ఇతరులకెవరికీ లేదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, సహకార సంఘం చైర్మన్ రాము, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, తొర్రూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషోర్, తహసీల్దార్ శివానీ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

వీఓఏల సమస్యలపై నిర్లక్ష్యం



నెహ్రూ సెంటర్ : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, వీఓఏలు



గార్ల : ప్రదర్శన నిర్వహిస్తున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాములు

నెహ్రూసెంటర్ : ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు విమర్శించారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో వీఓఏలు జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం రాములు మాట్లాడారు. వీఓఏలు 38 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఇతర అన్ని సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, మల్లయ్య, సరోజ, సుధాకర్, దుర్గారావు, శ్రీనివాస్, స్నేహిబిందు, కృష్ణవేణి, రజిత, అనిత, రోజ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల నిరసన ప్రదర్శన

గార్ల : మండల కేంద్రంలో వీఓఏలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దనియాకుల రామారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు ఉమ, వినోద, అనిత, వీరలక్ష్మి, రమ, చంద్రకళ, కల్పన, శారద, స్వామి, సురేష్, సైదులు, విజయ్, శ్రీకాంత్, మంగీలాల్, వెంకటలక్ష్మి, రజిని, స్వప్న, విజయకుమారి, అరుణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆ సంఘం అధ్యక్షురాలు శ్రీలత మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పురుషోత్తం, శ్రీలత, రాజు, యాకన్న, వసంత, మంజు, రజిత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి

నెహ్రూసెంటర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు కోరారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో 'మతోన్మాద ప్రభావం–కార్మికవర్గ ఐక్యత'పై గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల కార్మికులు శ్రమదోపిడీకి గురౌతున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈనెల 30న జిల్లావ్యాప్తంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని సూచించారు. సెమినార్‌లో నాయకులు సమ్మెట రాజమౌళి, కమ్మరికుంట్ల నాగన్న, గుగులోత్ సరోజ, పోతుగంటి మల్లయ్య, తోట శ్రీనివాస్, వెలిశాల సుధాకర్, ఝాన్సీ, కళావతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేత

దంతాలపల్లి : మండలం బొడ్లాడ గ్రామంలోని యువకులకు బీజేపీ గ్రామ బూత్ అధ్యక్షుడు శంకరబోయిన రామచంద్రయ్య గురువారం క్రికెట్, వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకరబోయిన సురేందర్ మాట్లాడారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు కిట్లు అందించినట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఒత్తిడి తగ్గించి శారీరక వికాసానికి దోహద పడతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తెప్ప అశోక్, ఎర్రం హేమంత్, మేకల మహేష్, జనిగల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించి కీర్తి పెంచాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు

బయ్యారం : సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లా కీర్తి పెంచాలని జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు కోరారు. సీఎం కప్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన మండల జట్టును మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె సన్మానించి మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాకు గుర్తింపు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నగూడూరు : సీఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన మండల క్రీడాకారులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అభినందించి మాట్లాడారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలం నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారులు షీల్డ్‌ను ఎంపీపీకి ప్రదానం చేశారు. సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో మహిళల జట్టు నుంచి జినక భవానీ, యువకుల జట్టు నుంచి బాదావత్ అంజి(మేఘ్యాతండా), లూనావత్ నవీన్ (మంగోరిగూడెం) ప్రతిభ చాటి ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, తహసీల్దార్ రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సర్పంచ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కురవి : ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించిన మండల క్రీడాకారులను ఎంపీడీఓ తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఫీ, పీడీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న చైర్‌పర్సన్ బిందు

మానవ మనుగడలో గోవులు కీలకం

- ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్

పెద్దవంగర : మానవ మనుగడలో గోవులు కీలకమని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. మహేశ్వరి గోశాల ఆధ్వర్యంలో మండలంలోని అవుతాపురం గ్రామంలో 10 మంది రైతులకు గురువారం లేగదూడలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడారు. గోవుల సంతతి వృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. గోవులు వ్యవసాయంలో రైతులకు చేదోడుగా ఉంటాయని చెప్పారు. పశువులకు పశుగ్రాసం అందుబాటులో లేని రైతులు తమను సంప్రదిస్తే దానా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సుధాకర్, ఫెడరేషన్ సూపరింటెండెంట్ దుర్గం రోజా, ప్రతినిధి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



గోవులు పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు

తొర్రూరు : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని గెస్ట్ హౌజ్‌లో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్యతో కలిసి రాంచందర్‌రావు మాట్లాడారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ ఊదరగొట్టినా నేటికీ ఒక్క రైతుకు కూడా అందించలేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను మిల్లర్లు ఆర్థికంగా దోచుకుంటున్నా చర్యల తీసుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియా, ఎరువుల కోసం రూ.లక్ష కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, నాయకులు రాజ్‌కుమార్, బొచ్చు సురేష్, పైండ్ల రాజేష్, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు

'కోనుగంటి'కి ఎన్టీఆర్ కళారత్న పురస్కారం



తొర్రూరు : తొర్రూరుకు చెందిన ప్రముఖ కళాకారుడు, గాయకుడు కోనుగంటి కృపాకర్ రాజుకు ఎన్టీఆర్ కళారత్న పురస్కారం లభించింది. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కృపాకర్‌రాజుకు అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ రాజు, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందజేశారు.

ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రపతికి అవమానం

మహబూబాబాద్ రూరల్ : బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానిస్తోందని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, మాజీ జెడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని బెల్లయ్య నాయక్ క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 28న సావర్కర్ జన్మదినం రోజున ఉద్దేశ్యపూర్వకంగానే పార్లమెంట్ భవన ఆవిష్కరణ కార్యక్రమం తలపెట్టిందని ధ్వజమెత్తారు. సావర్కర్‌ను ఆంగ్లేయుల ఏజెంటుగా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఉద్యమకారులను వ్యతిరేకించిన వ్యక్తిగా తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ వెంకట్ నాయక్, జిల్లా కార్యదర్శి వెంకన్ననాయక్, ఎస్టీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిప్పర్తి శ్రీధర్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు లింగాల వీరబద్రం గౌడ్, బడేటి కరుణాకర్, మేకల శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్ నాయక్, వెంకటేశ్వర్లు

శతాధిక వృద్ధురాలికి ఎమ్మెల్యే నివాళి

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పాశం నర్సమ్మ (105) మృతదేహానికి డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ నివాళులర్పించారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందగా అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నర్సమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ తేజావత్ శారద రవీందర్ నాయక్, సర్పంచ్‌లు శ్వేత ముకేష్, దేవిక శ్రీను నాయక్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, బీఆర్ఎస్ నాయకులు పాశం నరేష్‌రెడ్డి, బాలాజీ, భూక్య రఘు, సక్రాం, హుస్సేన్, సోమణి, భాస్కర్, రవి, శ్రీను ఉన్నారు.

కురవి : మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన గుంజ కవిత (28) గుండెపోటుతో మృతి చెందగా ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఆత్మ చైర్మన్ తోట లాలయ్య గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ షేక్ మస్తాన్, బీఆర్ఎస్ నాయకులు మక్కల ఎల్లయ్య, బస్వ వెంకన్న, ఆలకుంట్ల మల్లేష్, మక్కల మల్లేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : పట్టణంలోని నాగేంద్ర డిజిటల్ సెల్ వరల్డ్ యాజమాని మాధవరపు నాగేశ్వరరావు సతీమణి లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గురువారం పరామర్శించారు. తొలుత లక్ష్మి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మార్నేని వెంకన్న, గద్దె రవి, గోగుల రాజు, రఫీక్, ప్రసాద్ తదితరులున్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని తండధర్మారం రెవెన్యూ పరిధిలోని లచ్చతండ గ్రామ పంచాయతీ పరిధిలో బొడ్రాయి పండుగను పురస్కరించుకొని ఇటీవల కొత్తగా నిర్మించిన మారెమ్మ ఆలయానికి కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ బాధ్యులు మాలోతు నెహ్రూనాయక్ గురువారం రూ.50 వేల విరాళం అందించారు. ఈ మేరకు గ్రామ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోట వెంకట్‌రెడ్డి, సోమన్న, కమిటీ నిర్వాహకులు గుగులోతు మహేందర్, గుగులోతు బాలాజీ, దేవీదాస్, ఎల్ఐసీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మరిపెడ : మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయి ఆలయంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తొలుత భక్తులు, అర్చకులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే అభివృద్ధి'

మరిపెడ రూరల్ : డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బాల్నిధర్మారం సర్పంచ్ దార ఆనంద్ స్పష్టం చేశారు. మండలంలోని బాలిధర్మారంలో ముత్యాలమ్మ గుడి నుంచి పాత బొడ్రాయి వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొప్పెర శ్రీను, విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆనంద్

సిబ్బందికి వేతనాలు పెంచాలి

తొర్రూరు : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయడంతోపాటు పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం బిల్ కలెక్టర్లు, కారోబార్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు పెంచాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాద్య బీకు, నాయకులు గుండాల సోమ నర్సయ్య, బానోతు యాకయ్య, సురేందర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన బాధ్యత

నెల్లికుదురు : ప్లాస్టిక్ నిర్మూలనను బాధ్యతగా పీవైఎల్ జిల్లా నాయకుడు, వార్డు సభ్యుడు ఇరుగు అనిల్ అభివర్ణించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బంజరలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కారోబార్ నర్సయ్య, వీరయ్య, భద్రయ్య, భవానీ, వెంకటలక్ష్మి, వసుధ, జయప్రద, మహేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం

కురవి : మండల కేంద్రంలో గౌడ కులస్తులు కంఠమహేశ్వరస్వామికి గురువారం జలాభిషేకం నిర్వహించారు. తొలుత మేళతాళాలతో నెత్తిన బిందెల్లో నీళ్లు తీసుకుని కురవి పెద్ద చెరువు వద్ద ఉన్న కంఠమహేశ్వరస్వామి ఆలయానికి ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం స్వామివారికి జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో బండారి రమేష్, కత్తి వీరన్న, గోరు రాజన్న, బాలగాని శ్రీనివాస్, మోటపోతుల వెంకన్న, బాలగాని నవీన్, గోరు వీరయ్య, కత్తి రామ్మూర్తి, చిత్తనూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 930లో మార్పు చేయాలని వినతి

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ మున్సిపాల్టీ పరిధిలో చేపట్టిన ఎన్‌హెచ్ 930లో మార్పు చేయాలని కోరుతూ ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులు సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డికి మున్సిపల్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితులు సమస్యను వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రమేష్, వెంకటేశ్వర్‌రావు, సక్రునాయక్, హరిలాల్, కృష్ణ, కృష్ణమూర్తి, తదితరులున్నారు.

ఎంసెట్‌లో విద్యార్థినుల ప్రతిభ

కురవి : సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన మోడల్ రెసిడెన్షియల్ గురుకుల కళాశాల (ఈఎంఆర్ఎస్) విద్యార్థినులు ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య గురువారం తెలిపారు. కళాశాల విద్యార్థినులు బి.స్రవంతి (ఎంపీసీ) ఇంజనీరింగ్‌లో 31 వేల 30వ, బానోత్ మానస(బైపీసీ) మెడికల్ అండ్ అగ్రికల్చర్‌లో 12 వేల 852వ ర్యాంకు సాధించినట్లు ఆమె వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు అభినందించారు.



బానోత్ మానస



బి.స్రవంతి

ప్రమాదకరంగా హోర్డింగ్

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్ విరిగి ప్రమాదకరంగా ఉంది. రోగులకు సమాచారం అందించేలా ఏర్పాటు చేసిన ఈ హోర్డింగ్ ఇటీవల కురిసిన వర్షాలు, గాలిదుమారాలకు ఒకవైపు విరిగి ఎప్పుడు కిందపడి ప్రమాదం జరుగుతుందోనని రోగులు భయాందోళనకు గురౌతున్నారు. నిత్యం భారీ సంఖ్యలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోగులు వచ్చే క్రమంలో హోర్డింగ్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

